# పిచ్చెక్కిందా?

**మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. చిన్నారావు ఇంట్లోని చిన్నా పెద్దా కుటుంబ సభ్యులంతా టి.వి. ముందు శిల్పాల్లా బిగుసుకుపోయి కూర్చుని ఉన్నారు. సరిగ్గా రోజూ ఆ సమయాని కల్లా టి.వి.కి అతుక్కుపోయినట్లు కూర్చోవటం ఆ ఇంటిల్లిపాదికీ అలవాటైపోయింది.**

ఠంచనుగా పన్నెండు గంటలు కొట్టేసరికి టి.వి.లో అదేదో ఛానల్‌లో ఇచ్చకాల బుచ్చమ్మ నిర్వహించే 'పిచ్చెక్కిందా!' అనే కార్యక్రమం మొదలవుతుంది. ఆ బుచ్చెమ్మ బుల్లితెరమీద ప్రత్యక్షంకాగానే 'పిచ్చెక్కిందా!' అంటూ పలకరించి అందరికీ ఫోన్లు చేస్తూ ఫోన్ కలిసిన వారిని వాళ్ళు ఆ ప్రోగ్రాం చూస్తున్నారో లేదో రూఢి చేసుకోవటానికి కొన్ని ప్రశ్నలు వేస్తూ మధ్యలో కబుర్లు చెప్తూ ఉంటుంది. అలా టి.వి. చూస్తున్న వాళ్ళకు మాత్రమే రకరకాల బహుమతులను ఇస్తూ ఉంటుంది. టి.వి. చూడటం లేదని తెలిస్తే ఫోన్ కట్, గిఫ్టులు ఫట్. అంతేకాదు ఫోన్ తీయగానే 'పిచ్చెక్కిందా!' అన్నారా లేదా అనేది కూడా పాయింటే.

చిన్నారావు భార్య చంచలాక్షికి ఉచితంగా వచ్చేవాటిపై మోజెక్కువ. అప్పనంగా వచ్చేది ఏదైనా అపురూపంగా కనిపిస్తుంది ఆమెకు. ఇక చెప్పేదేముంది? ఫోన్ నెంబరు ఎన్‌రోల్ చేయించుకుని రోజూ ఆ టైమ్‌కు టి.వి. చూస్తుంటుంది. ఒక్క నిమిషం టి.వి. ముందు నుండి అవతలికి వెళ్ళినా ఆ సమయంలో ఏం మిస్ అవుతానో అని భయం.

ఆ గంటసేపూ ఎవరూ ఎవరికీ ఫోన్లు చేసే కార్యక్రమం పెట్టుకోకూడదని, ఎక్కడికీ వెళ్ళకూడదనీ, ఎవరు వచ్చినా మాట్లాడకూడదని, ఏ ఇతర పనులు చేయకూడదని ఇలా ఇంట్లో వాళ్ళకు కొన్ని షరతులు పెట్టింది.

అంతేకాదు. 'పిచ్చెక్కిందా!' ప్రోగ్రాం ద్వారా డైమండ్ పెండెంట్ వస్తే ఆడపడుచుకు, డైమండ్ రింగ్ వస్తే మరిదికి ఇచ్చేటట్లు, కలర్ టి.వి. వస్తే ప్రత్యేకంగా అత్తమామల గదిలో పెట్టించేటట్లు ఇలా అందరికీ ఆశ చూపి ఆ ప్రలోభంలో పడేసింది. డైమండ్ నెక్లెస్ వస్తే మాత్రం తన కోసమే అని నిర్ణయించుకుంది. ఇప్పుడందరి దృష్టి తమకు త్వరలో రాబోయే బహుమతుల మీదే. ఇక రోజూ ఈ 'పిచ్చెక్కిందా!' ప్రోగ్రాం చూడటానికి వాళ్ళు కూడా అలవాటు పడిపోయారు. ప్రతిరోజూ సరిగ్గా పన్నెండు గంటలయ్యేసరికల్లా అందరూ టి.వి. ముందు సెటిలయిపోతున్నారు. ఫోన్ రింగవుతుందేమోనని ఎదురు చూస్తూ ఉంటారు.

* * *

'ట్రింగ్, ట్రింగ్' అంటూ ఫోన్ రింగయింది. ఇంట్లో అందరూ ఎలర్ట్ అయ్యారు. బుచ్చెమ్మ పళ్ళికిలిస్తూ ఫోన్‌లో మాట్లాడుతోంది. ఫోన్ కలిసిన వాళ్ళందరికీ బోలెడన్ని బహుమతులను ప్రకటించేస్తోంది.

టి.వి. చూస్తున్న వాళ్ళందరికీ టెన్షన్ పెరిగిపోతోంది. ఏ క్షణంలో తమ ఫోన్ రింగవుతోందనని రెప్పవాల్చకుండా టి.వి. చూస్తూ, ఫోన్ శబ్దం కోసం చెవులు రిక్కించుకుని యమ యాంగ్జయిటీగా గడుపుతున్నారు. సెకన్లు, నిమిషాలు గడుస్తూ గంట టైమ్ పూర్తయింది. బుల్లితెర బుచ్చెమ్మ 'టాటా', 'బై, బై' చెప్పేసి 'బెటర్ లక్



నెక్ట్స్ టైమ్' అంటూ తెర మరుగైపోయింది. ఉన్నట్లుండి అందరికీ కడుపులో ఆత్మారాముడు ఘోషించడం మొదలుపెట్టాడు. అందరూ ఒకేసారి 'ఆకలి, ఆకలి' అంటూ లేచారు.

మళ్ళీ మర్నాడు మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఇదే తంతు. ఇలా ఓ నెల రోజులుగా ఆ ఇంట్లో జరుగుతున్న కార్యక్రమం ఇదే. చంచలాక్షి ఫ్రెండ్స్‌లో చకోరాక్షి మరికొంతమంది "మాకు ఫలానా బహుమతి వచ్చింది. ఏమటి నీకు ఇంకా రాలేదా? అసలు నువ్వు టి.వి. చూస్తున్నావా చంచూ?" అంటూ అడగటం మొదలెట్టారు. చంచలాక్షికి తనకు గిఫ్ట్ రాలేదన్న మనోవేదన, ఎలాగైనా గెలుచుకోవాలన్న తపన ఎక్కువయ్యాయి.

* * *

చిన్నారావుది చింతలు లేని చిన్న కుటుంబమే. చేసేది గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగమైనా కష్టపడి పనిచేయటమే అతనికి ఇష్టం. స్వశక్తిమీద ఆధారపడటం చిన్నప్పటి నుండి చిన్నారావుకు అలవాటు.

లాటరీలకు ఆశపడటం, ఏదో లాభాలు, బహుమతులు వచ్చేవాటి కోసం ఎగబడటం అతనికి నచ్చని విషయం. అతనికి పూర్తిగా విరుద్ధం అతని భార్య చంచలాక్షి. అలాంటి వాటికోసం ఆశపడటం అవివేకం అని ఎంతగానో చెప్పి చూశాడు. అయినా ఆమె పద్ధతి మారదు.

"అదృష్టం అనేది ఎప్పుడు ఎవరిని వరిస్తుందో ఎవరికి తెలుసు? మీలా చేతులు ముడుచుకుని కూర్చోవటం నాకు చేతకాదు. అదృష్టదేవత ఎప్పుడో ఒకప్పుడు మన తలుపు కూడా తడుతుంది. మన ఫోన్ కూడా రింగవుతుంది. చూస్తూ ఉండండి" అంటూ అందుకోసం వీలయినన్ని ప్రయత్నాలు చేస్తూ ఉంటుంది.

ఆమెకు టి.వి. నిండా ఈమధ్య రాసులు రాసులుగా బంగారం కనిపిస్తూ కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నది. స్పాన్సర్స్ అందజేస్తున్న రకరకాల బహుమతులు, చీరలు ఆమెను ఊరిస్తున్నాయి. అందుకే ఏదీ వదిలిపెట్టకుండా అన్నిటికీ ప్రయత్నిస్తూ ఉంటుంది. ఆమెతోపాటు ఇంట్లో ఉన్న మిగతావారిని కూడా ఈ పిచ్చిలో తలమునకలుగా మునిగిపోయేటట్లు చేసిందని చిన్నారావు బాధ.

* * *

ఒకరోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు చిన్నారావు ఇంట్లో 'ట్రింగ్, ట్రింగ్' అంటూ ఫోన్ రింగయింది.

చంచలాక్షి చెంగున ఫోన్ దగ్గరకు దూకి రిసీవర్ తీసి పలికేలోగానే "హాయ్! పిచ్చెక్కిందా?" అంటూ పలకరించింది బుల్లితెర బుచ్చెమ్మ.

చంచలాక్షి పట్టరాని ఆనందంతో ఎగిరి గంతేసింది.

"హాయ్! పిచ్చెక్కింది" అంటూ అరిచింది.

"ఎవరు మాట్లాడుతున్నారు?" అంది బుచ్చెమ్మ.

"నేను చంచలాక్షిని, మీరంటే నాకు చాలా చాలా ఇష్టం బుచ్చెమ్మగారూ! నేను మీ ఫాన్ని"

"అలాగా! చాలా సంతోషం చంచలాక్షిగారూ! మీరు టి.వి. చూస్తున్నారా?" అని అడిగింది అవతలనుండి బుచ్చెమ్మ ఫోన్‌లో.

"టి.వి.నా! అయ్యో!" అంటూ ఒక్కసారిగా నీరసపడింది చంచలాక్షి. అప్పుడు గాని గుర్తురాలేదు గంటసేపటి నుండి కరెంటు లేని సంగతి.

"అరె! మా ఇంట్లో కరెంటు లేదు బుచ్చెమ్మగారూ!"

"అయ్యో! అయాం వెరీ వెరీ సారీ చంచలాక్షిగారూ! మీరు టి.వి.చూడ్డం లేదు గాబట్టి నేను మీకు గిఫ్ట్ ఇవ్వలేకపోతున్నాను. సో సారీ!" అంటూ ఫోన్ పెట్టేసింది బుచ్చమ్మ.

'తగలక తగలక ఫోన్ తగిలితే ఇలా అయిందేమిటా' అని చంచలాక్షి నిజంగానే పిచ్చిపట్టిన దానిలా జుట్టుపీక్కుంది.

**-అబ్బరాజు జయలక్ష్మి** (హైదరాబాద్)